సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 10 । ఆగస్టు । 2023



ఆలయ చైర్‌పర్సన్ రాజీనామా
భీమవరంలోని సోమేశ్వర జనార్దన స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కోడే విజయలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు.

8లో ▸



కొల్లేరు.. కనువిందు
ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కొల్లేరు సరస్సులో పక్షుల గుంపులు ఆకట్టుకుంటున్నాయి. సందర్శించే పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

8లో ▸

మృతదేహం లభ్యం
తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో కాలువలో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం తణుకు రూరల్ పోలీసులు గుర్తించారు.



8లో

న్యూస్‌రీల్

ఎన్‌జీఓ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ఎన్‌జీఓ 21వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లో పశ్చిమగోదావరి జిల్లా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్జీఓ 21వ మహా సభలకు ఆహ్వానిస్తూ ప్రచురించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. 21వ ఎన్జీఓ సంఘం మహాసభలు జయప్రదం కావాలని, ఈ మహాసభల ద్వారా ఉద్యోగులకు మేలు జరగాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులది కీలక పాత్రని, కష్టపడి పనిచేసి జిల్లాను మరింత అభివృద్ధి చేద్దామని కలెక్టర్ సూచించారు. ఏలూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీధరరాజు, కె.సత్యనారాయణ, ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ కె.నాగమణి, జిల్లా ఏలూరు తాలూకా ఎన్జీఓ సంఘ నాయకులు పూడి శ్రీనివాస్, నరేంద్ర, బేగ్, సాంబశివరావు రవికుమార్, సునీత, కుసుమ కుమారి, లీలా రాణి, సత్యభారతి పాల్గొన్నారు.

'నవోదయ' విద్యార్థుల కృతజ్ఞతలు



కలెక్టర్‌ను కలుసుకున్న విద్యార్థులు

ఏలూరు(మెట్రో): పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయలో ఈనెల 4న అస్వస్థతకు గురై కోలుకున్న విద్యార్థులు బుధవారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ వ్యక్తిగత శ్రద్ధ తీసుకున్న కారణంగా తమకు సకాలంలో మెరుగైన వైద్యం లభించిందని, తాము ప్రాణాపాయం నుంచి బయటపడ్డామని విద్యార్థులు అన్నారు. కలెక్టర్ చొరవతో తమ పిల్లలను ప్రాణాలతో చూడగలిగామని తల్లిదండ్రులు అన్నారు. విద్యార్థులంతా కోలుకునే వరకూ వైద్య సేవలను కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అజిత్, టీవీఎన్ రావు, లక్ష్మణరావు, ఎన్ఎం రావు, కేరళకు చెందిన విద్యార్థులు అద్వైద్ సింహాన్, ఎస్.కార్తీక్, ఆర్.ఎస్. నిరంజన్, విద్యార్థి తండ్రి సౌమ్య మోల్ ఉన్నారు.


అమరవీరులను స్మరించుకోవాలి



మొక్కలు నాటుతున్న ఎస్పీ రవిప్రకాష్

పెనుగొండ: దేశ స్వాతంత్ర్య సముపార్జనలో ప్రాణత్యాగాలు చేసిన వీరులను స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పెనుగొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అమరుల త్యాగాలను మరవకూడదని, వారిని స్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. కాలుష్య నివారణకు మొక్కలు నాటాలన్నారు. డీఎస్పీ కె.రవి మనోహరాచారి, సీఐలు జి.నాగేశ్వరరావు, ఎంవీ సత్యనారాయణ, ఎస్సైలు ఎస్ఎన్‌వీ రమేష్, బి.సురేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ

తణుకు అర్బన్: విద్యార్థులతో సైన్స్ ప్రాజెక్టులు రూపొందించేందుకు ఉపాధ్యాయులు వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ఆర్.వెంకటరమణ అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో బుధవారం తణుకు, తాడేపల్లిగూడెం డివిజన్‌ల పరిధిలో సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహించిన ఇన్‌స్పైర్ అవార్డ్స్ వర్క్‌షాప్ శిక్షణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో ఉపయుక్తమైన ప్రాజెక్టులు తయారు చేయించాలని సూచించారు. అనంతరం ఇన్‌స్పైర్ అవార్డుల కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంఈఓ కె.సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి శ్యామ్‌ప్రసాద్, హెచ్ఎం కె.పద్మావతి పాల్గొన్నారు.

స్వగృహమస్తు



పాలకొల్లు మండలం దగ్గులూరు లేవుట్‌లో జగనన్న ఇళ్లు

నిర్మాణం.. శరవేగం
- **జిల్లాలో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు**
- 25,402 గృహ నిర్మాణాలు పూర్తి
- పలు దశల్లో 37,914 ఇళ్లు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- సుమారు రూ.400 కోట్ల వ్యయం

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హులందరికీ స్థలాలను మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. వందలాది ఎకరాలను సేకరించి జగనన్న లేఅవుట్‌లుగా తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అలాగే సొంత స్థలంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా చేయూత అందిస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 630 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అలాగే సొంత స్థలం కలిగిన వారు ప్రభుత్వ సాయంతో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇప్పటికే వేలాది మంది గృహప్రవేశాలు కూడా పూర్తిచేసుకున్నారు. అయితే ఇవేమీ పట్టించుకోని పచ్చమీడియా ఇళ్ల నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తోంది.

1,531 ఎకరాల్లో 630 లేఅవుట్లు

ప్రభుత్వం జిల్లాలో 1,531.308 ఎకరాలను సేకరించి 630 లేవుట్‌ల్లో పేదలకు స్థలాలను మంజూరు చేయడంతో పాటు సొంత స్థలంలో నిర్మాణాల కింద మొత్తంగా 72,059 ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే 25,402 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా సుమారు 24 వేల మంది గృహప్రవేశాలు కూడా పూర్తిచేశారు. మిగిలిన 1,402 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు తుది మెరుగులు దిద్దుకుంటున్నారు. అలాగే శ్లాబ్ పూర్తయినవి 1,513, శ్లాబ్ దశలో 2,025, ప్రాథమిక దశలో 34,376 ఇళ్లు పలు దశల్లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణానికి ఇప్పటివరకూ సుమారు రూ.400 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.



కుప్పనపూడి లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలు



దగ్గులూరు లేవుట్‌లో పూర్తయిన నిర్మాణాలు

ప్రత్యేక శ్రద్ధతో అధికారులు

కలెక్టర్ పి.ప్రశాంతి జగనన్న లేవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తరచూ హౌసింగ్, మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తూ ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ఇసుక బల్క్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ 10 వేల నుంచి 20 వేల టన్నుల వరకు ఇసుక నిల్వలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి వారికి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తున్నారు. అలాగే జగనన్న కాలనీల్లో తాగునీరు, డ్రైయినేజీ, విద్యుత్, అంతర్గత రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నారు.

మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాలు

మండలం	మంజూరు	పూర్తయినవి
ఆచంట	2,508	1,189
పెనుగొండ	3,528	1,180
పెనుమంట్ర	3,350	1,299
పోడూరు	2,832	1,222
భీమవరం	1,798	859
భీమవరం అర్బన్	3,266	285
వీరవాసరం	1,557	747
మొగల్తూరు	2,261	1,261
నరసాపురం అర్బన్	4,841	426
నరసాపురం	2,925	897
పాలకొల్లు	1,298	858
పాలకొల్లు అర్బన్	2,503	219
యలమంచిలి	2,914	1,319
పెంటపాడు	2,324	1,222
తాడేపల్లిగూడెం	3,628	1,814
తాడేపల్లిగూడెం అర్బన్	3,547	1,113
అత్తిలి	2,478	861
ఇరగవరం	2,563	1,163
తణుకు	4,175	1,141
తణుకు అర్బన్	6,118	643
ఆకివీడు అర్బన్	1,342	262
ఆకివీడు	2,278	555
కాళ్ల	1,078	724
పాలకోడేరు	2,380	833
ఉండి	2,904	1,202
గణపవరం	1,663	876

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సీఎం జగన్ ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకుని ఈ ఏడాది జనవరిలో గృహప్రవేశం చేశాం. మా లేవుట్‌లో చాలా మంది ఇళ్లు కట్టుకుంటున్నారు. కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించారు. రోడ్లు వేస్తున్నారు. సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– బాలం భాగ్యలక్ష్మి, విస్సాకోడేరు లేఅవుట్

8 నెలల క్రితమే గృహప్రవేశం



నాకు దగ్గులూరు లేవుట్‌లో ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు నిర్మాణానికి రుణ సాయం కూడా చేశారు. దీంతో నేను ఇల్లు కట్టుకుని 8 నెలల క్రితమే గృహప్రవేశం చేశాను. నా సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేశారు. మా లేఅవుట్‌లో నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి.

– చుందూరి చిననాగమ్మ, దగ్గులూరు లేఅవుట్

25,402 ఇళ్లు పూర్తి



జిల్లాలో ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఇప్పటివరకు 25,402 ఇళ్లు పూర్తికాగా వేలాది ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరా చేయడానికి బల్క్ పాయింట్లు కూడా ఏర్పాటు చేస్తున్నాం. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్

661 జంటలకు కల్యాణమస్తు



కలెక్టరేట్‌లో చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో 661 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకం కింద రూ.4.48 కోట్లు మంజూరైందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి బుధవారం సీఎం జగన్ కళ్యాణమస్తు కార్యక్రమాన్ని వర్చ్యువల్‌గా వీక్షించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి సంబంధించి నిధులు విడుదలయ్యాయన్నారు. జిల్లాలో 420 బీసీ జంటలకు రూ.2.10 కోట్లు, 26 బీసీ కులాంతర వివాహ జంటలకు రూ.19.50 లక్షలు, 7 బీసీసీడబ్ల్యూ జంటలకు రూ.2.80 లక్షలు, 10 మంది దివ్యాంగ జంటలకు రూ.15 లక్షలు, 9 మైనార్టీ జంటలకు రూ.9 లక్షలు, 167 ఎస్సీ జంటలకు రూ.1.67 కోట్లు, 18 ఎస్సీ కులాంతర వివాహ జంటలకు రూ.21.60 లక్షలు, 4 ఎస్టీ జంటలకు రూ.4 లక్షలు మంజూరయ్యారన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి డి.పుష్పరాణి, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొనసాగిన నామినేషన్ల ప్రక్రియ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మూడు సర్పంచ్, 28 వార్డు సభ్యుల పదవులకు రెండో రోజు దాఖలైన నామినేషన్ వివరాలను డీపీఓ జీవీకే మల్లికార్జునరావు ఓ ప్రకటనలో తెలిపారు. కావలిపురం, అగర్తిపాలెం, దొడ్డిపట్ల పంచాయతీల సర్పంచ్ పదవులకు బుధవారం ఎవరూ నామినేషన్ వేయలేదని, వార్డు సభ్యుల కోసం 6 నామినేషన్లు వచ్చాయని పేర్కొన్నారు. ఉండి మండలం కలిసిపూడిలో రెండు, ఆకివీడు మండలం అజ్జమూరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం చింతపర్రు, గణపవరం మండలం గణపవరంలో ఒక్కో నామినేషన్ వేశారని తెలిపారు.

స్వాతంత్య్ర సమర యోధులు.. స్ఫూర్తి ప్రదాతలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో నా భూమి.. నా దేశం ర్యాలీలో పాల్గొన్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక

తణుకు అర్బన్: భారతదేశ గడ్డపై పుట్టిన ప్రతి పౌరుడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమర వీరులను మననం చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం తణుకు ఎన్టీఆర్ పార్కు ప్రాంతంలో నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను ఏర్పాటుచేయాలని ప్రధాని మోదీ పిలుపునివ్వడం సంతోషకరమని, తణుకులో రెండు నెలల క్రితమే బ్యాంకు కాలనీలోని పార్కులో 17 మంది సమరయోధుల విగ్రహాలను ఏర్పాటుచేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరులను మననం చేసుకునేందుకు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం చాలా మంచిదని, తన తండ్రి వంక సత్యనారాయణ (వంక సత్యం) కూడా స్వాతంత్ర్యోద్యమ పోరాటాల్లో కీలకపాత్ర పోషించడం గర్వకారణంగా ఉందన్నారు. సమాజంలో అసమానతలు పూర్తిస్థాయిలో తొలగించేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల పేర్లతో ఏర్పాటుచేసిన శిలాఫలకాలను మంత్రి కారుమూరి ఆవిష్కరించి సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి పట్టణంలో ర్యాలీ చేశారు. మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఏఎంసీ చైర్మన్ సత్తా కృష్ణవేణి, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, సుద్దుల పాండు, కర్రి గంగాధర అప్పారావు, షేక్ సలీం, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

రూ.146 కోట్లతో రహదారుల అభివృద్ధి

ఎఫ్‌డీఆర్.. రోడ్లు సూపర్
- 13 రాష్ట్ర, జిల్లా ప్రధాన రోడ్ల మరమ్మతులు
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం
- ఏళ్ల తరబడి చెక్కుచెదరకుండా చర్యలు



అభివృద్ధి చేయనున్న యర్నగూడెం-పొంగుటూరు రాష్ట్ర ప్రధాన రహదారి

జంగారెడ్డిగూడెం: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ప్రధాన రహదారులు 6, జిల్లా ప్రధాన రహదారులు 7 మొత్తంగా 13 రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ప్రజారవాణా వ్యవస్థను మెరుగైన స్థితిలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా రోడ్డు మార్గాలను ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తోంది. అత్యంత అవసరమైన రోడ్లను ముందుగా, మిగిలినవి క్రమపద్ధతిలో మరమ్మతులు చేయిస్తోంది. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రధాన మార్గాలను అభివృద్ధి చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులు సైతం ఈ రహదారులకు సాంకేతిక అనుమతులు మంజూరు చేసేందుకు సమాయాత్తమయ్యారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు.

ఎఫ్‌డీఆర్ పద్ధతిలో.. రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులను ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డీఆర్) సాంకేతిక పద్ధతిలో నిర్మాణం, నిర్వహణ, బదిలీ (బీఓటీ) ప్రాతిపదికన వీటిని నిర్మించనున్నారు. ఎఫ్‌డీఆర్ పద్ధతి అంటే ప్రస్తుతం ఉన్న రోడ్డును యంత్రాల సహాయంతో సుమారు అడుగు లోతు తవ్వుతారు. ఆ తర్వాత సిమెంట్, కెమికల్ కలిపి చదును చేస్తారు. ఆపై ఒక దానిపై మరో లేయర్‌తో రోడ్డు నిర్మాణం చేస్తారు. దీంతో రోడ్డు దీర్ఘకాలం చెక్కుచెదరకుండా ఉంటుంది. ఇవి సాధారణ రోడ్ల కంటే 15 నుంచి 20 ఏళ్ల పాటు నాణ్యంగా ఉంటాయి. ఇందు కోసం మొత్తం రూ.146.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీనిలో రాష్ట్ర ప్రధాన రహదారులకు రూ.91.50 కోట్లు, జిల్లా ప్రధాన రహదారులకు రూ.55.30 కోట్లు కేటాయించింది.

త్వరలోనే టెండర్లు

వారంలో రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారుల మరమ్మతులు, నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం. ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో రోడ్ల నిర్మాణం జరుగుతుంది. ప్రస్తుతం సాంకేతిక అనుమతులు ఇస్తున్నాం. ఇది పూర్తికాగానే టెండర్లు పిలుస్తాం. రాష్ట్ర ప్రధాన రహదారులకు రూ.91.50 కోట్లు, జిల్లా ప్రధాన రహదారులకు రూ.55.30 కోట్లు మంజూరయ్యాయి.

– జి.జాన్‌మోషే, ఎస్ఈ ఆర్అండ్‌బీ

రాష్ట్ర ప్రధాన రహదారులు (రూ.91.50 కోట్లు)
- కాశీపట్నం నుంచి భీమవరం రోడ్డులో 0 కి.మీ నుంచి 15.953 కిలోమీటర్ల వరకు (ఎస్‌హెచ్ 302).
- చేబ్రోలు నుంచి దేవులపల్లి రోడ్డులో 14వ కి.మీ నుంచి 19 కి.మీ వరకు (ఎస్‌హెచ్ 182).
- వడలి నుంచి తాడినాడ రోడ్డులో 0 నుంచి 8 కి.మీ వరకు, 14 కి.మీ నుంచి 24.22 కి.మీ వరకు (ఎస్‌హెచ్ 231).
- యర్నగూడెం–పొంగుటూరు రోడ్డులో 0 కి.మీ నుంచి 14.800 కి.మీ వరకు (ఎస్‌హెచ్ 184).
- నూజివీడు–గన్నవరం రోడ్డులో 14.200 కి.మీ నుంచి 20 కి.మీ వరకు (ఎస్‌హెచ్ 238).
- వద్ద మన్నాడ నుంచి పెదలంక రోడ్డులో 37.800 కి.మీ నుంచి 44 కి.మీ, 47 కి.మీ నుంచి 52.900 కి.మీ వరకు (ఎస్‌హెచ్ 304).

జిల్లా ప్రధాన రహదారులు (రూ.55.30 కోట్లు)
- అత్తిలి నుంచి అలంపురం రోడ్డులో 6 కి.మీ నుంచి 16.260 కి.మీ వరకు.
- ఉరదళ్లపాలెం నుంచి దువ్వ రోడ్డులో 0కి.మి నుంచి 11.200 కి.మీ వరకు
- ఉప్పుటేరు నుంచి కలిదిండి రోడ్డులో 1.770 కి.మీ నుంచి 13 కి.మీ వరకు.
- నవాబ్‌పాలెం–దండగర్ర రోడ్డులో 0 కి.మీ నుంచి 7.340 కి.మీ వరకు
- గుండుగొలను నుంచి కొరుకొల్లు రోడ్డులో 0 కి.మీ నుంచి 5.600 కి.మీ వరకు.
- పొంగుటూరు నుంచి లక్కవరం రోడ్డులో 0 కి.మీ నుంచి 11.950 కి.మీ వరకు.
- వేల్పూరు–రామేశ్వరం రోడ్డులో 0 కి.మీ నుంచి 11.100 కి.మీ వరకు అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశారు.

దేశభక్తిని చాటేలా 'నా భూమి.. నా దేశం'

భీమవరం (ప్రకాశంచౌక్): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా నా భూమి–నా దేశం కార్యక్రమంలో మట్టి సేకరించి సమర్పించే కార్యక్రమం చేపట్టామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరం ప్రకాశం చౌక్‌లో బుధవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 వరకు గ్రామ పంచాయతీల్లో, 20వ తేదీ వరకు పట్టణాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో సమర యోధుల శిలాఫలాకాలు ఆవిష్కరించి సెల్ఫీలతో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. డీపీఓ మల్లికార్జునరావు, డీఎస్పీ శ్రీనాథ్, ఆర్డీఓ దాసి రాజు మాట్లాడుతూ అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించి 11న క్విట్ ఇండియా స్థూపం వద్ద అమర వీరులకు నివాళిర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. క్విట్ ఇండియా పునఃనిర్మాణ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, ఇందుకూరి ప్రసాద్‌రాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎస్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో బస్‌స్టేషన్ నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు ఈనెల 29న ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక డీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2+2 వీడియో కోచ్ సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటుచేశామని, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం క్షేత్రాల మీదుగా బస్సు 31న అరుణాచలం చేరుకుంటుందన్నారు.

క్లుప్తంగా

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై గుర్రయ్య

తణుకు: తేతలి గ్రామ పరిధిలో కాలువలో పడి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం తణుకు రూరల్ పోలీసులు గుర్తించారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామానికి చెందిన గొర్తి అచ్యుతం (45), స్నేహితుడు దాసరి మార్కు తణుకు నుంచి మోటారుసైకిల్‌పై స్వగ్రామం వెళుతుండగా తేతలి జాతీయ రహదారిపై తేతలి వద్ద ప్రమాదవశాత్తూ బైక్‌తో సహా కాల్వలో పడ్డారు. ఈ ప్రమాదంలో మార్కు స్వల్పగాయాలతో బయటపడగా అచ్యుతం గల్లంతయ్యాడు. బుధవారం అచ్యుతం మృతదేహాన్ని మండపాక సమీపంలో గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్సై కె.గుర్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘మిషన్ ఇంద్ర ధనుష్’ ప్రారంభం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో మిషన్ ఇంద్ర ధనుష్ పథకాన్ని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. అలాగే ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ ఇంద్ర ధనుష్ ద్వారా పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధిక టీకాలు వేస్తామన్నారు. అలాగే ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకంలో హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలతో పాటు సంపూర్ణ పోషకాహారం అందిస్తామన్నారు. తల్లిపాల వారోత్సవాలను కూడా ప్రారంభించి తల్లి పాలు ప్రాముఖ్యతను బాలింతలకు, గర్భిణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సుజాతరాణీ, డీఏఒ దేవసుధ, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వీరాస్వామి, ఆస్పత్రి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారాయణరాజు, వైద్యులు రామమహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు.. కనువిందు

- పక్షుల రాకతో ఆహ్లాదకరంగా సరస్సు
- పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య
- ఆకట్టుకుంటున్న పక్షుల విడిది కేంద్రం
- మాధవాపురం వద్ద ప్రత్యేక రిసార్ట్ ఏర్పాటు


పక్షుల విడిది కేంద్రం వద్ద గూడు కట్టుకుంటున్న పక్షులు (ఫైల్)


మాధవాపురంలో పక్షుల విడిది కేంద్రం

ఏలూరు రూరల్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కొల్లేరు సరస్సును సందర్శించే పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పిల్లలు, పెద్దలు సరస్సు అందాలను తిలకించేందుకు తరలివస్తున్నారు. వివిధ రకాల పక్షులు గుంపులుగా ఎగురుతూ పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. దోనెలపై మత్స్యకారుల సంప్రదాయ వేట ఆకట్టుకుంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాలో 308.5 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న సరస్సు ప్రస్తుతం నిండుకుండలా మారింది. ఫలితంగా మత్స్య సంపద పెరుగుతోంది. చేపలను వేటాడేందుకు పెద్ద సంఖ్యలో పక్షుల రాక పెరిగింది. సరస్సుకు దిగువున రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టనుండటంతో రానున్న రోజుల్లో సరస్సు మరింత శోభను సంతరించుకోనుంది.

ఏలూరుకు కూత వేటు దూరంలో..

ఏలూరు నగరానికి 12 కిలోమీటర్ల దూరంలో మాధవపురం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన పక్షుల విడిది కేంద్రం రకరకాల పక్షులతో అలరారుతోంది. వీటిని చూసేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుండటంతో వీరి కోసం అటవీశాఖ అధికారులు హట్స్ (గుడెసెలు), జెట్టీ నిర్మించారు. నీటిలో షికారు కోసం బోటు సిద్ధం చేశారు. పిల్లలు ఆడుకునేందుకు జారుడు బల్లలు, ఊయల ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దేశంలోనే పేరొందిన సరస్సు ప్రాభవం కోల్పోయింది. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు రూ.8 కోట్ల వ్యయంతో కొల్లేరు రోడ్లను అభివృద్ధి చేస్తోంది. పర్యాటకులు సేద తీరేందుకు వీలుగా ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో వసతి గదులతో కూడిన రిసార్ట్స్ ఏర్పాటు చేసింది.

పక్షుల రాకకు అనువుగా చర్యలు

అటవీశాఖ అధికారులు సుమారు రూ.10 లక్షలతో పక్షుల విడిది కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. పక్షుల రాకకు అనువుగా వాటికి ఆహారం కోసం సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో చెరువు సిద్ధం చేశారు. ఆహారం కోసం విదేశాల నుంచి వస్తున్న ఫ్లెమింగో, పెయింటెడ్ కాక్, కొల్లేటి కొంగ, కింగ్‌ఫిష్ తదితర రకాల పక్షులు ఎక్కువగా ఇక్కడకు వలస వస్తున్నాయి. చెట్లపై గూళ్లు కట్టుకుని పిల్లలను పొదుగుతున్నాయి. నెలల తరబడి నివాసం ఉండి వేసవిలో పిల్లలతో సహా తిరుగుముఖం పడతాయి.

ఇవి కూడా చూడొచ్చు

పక్షుల విడిది కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో కొల్లేరు ప్రజలకు తాగునీరు అందించే మొండికోడు రిజర్వాయర్ ఉంది. దీన్ని తిలకించిన పిల్లలకు తాగునీటి సరఫరా వ్యవస్థపై అవగాహన కలుగుతుంది. ఈ గ్రామంలోనే సంతోషిమాత ఆలయం భక్తులకు దర్శనిమిస్తుంది. మరోపక్క మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న గుడివాకలంకలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన సుందరమైన చర్చి పర్యాటకులను ఆకట్టుకుంటుంది. అలాగే స్థానిక రామాలయంలో నిత్యం ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. బీసీ కాలనీలో యువకులు సాయంత్రం వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. మరో ఏడు కిలోమీటర్ల దూరంలోని ప్రత్తికోళ్లలంక కూడలిలో నిర్మించిన భారీ ఆంజనేయస్వామి విగ్రహం పర్యాటకులకు స్వాగతం పలుకుతుంది. కొల్లేరు మల్లన్నగా పేరుగాంచిన శివాలయం, ఎదురుగా ఒంటికాలిపై తపస్సు చేస్తున్న భగీరథ విగ్రహం పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి



జిల్లా అటవీశాఖ అధికారి ఆదేశాల మేరకు రూ.10 లక్షలతో పక్షుల విడిది కేంద్రం అభివృద్ధి చేశాం. చెరువు వద్ద జెట్టీలు ఏర్పాటు చేసి బోటు షికారు సైతం ఏర్పాటు చేశాం. పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం అభివృద్ధి చేశాం. ఈ కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కమిటీ వేశాం. పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయంతో మౌలిక వసతులు మెరుగుపరుస్తాం

– ఎస్‌వీకే కుమార్, ఏలూరు రేంజర్, అటవీ శాఖ


పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటస్థలం


పర్యాటకులు సేద తీరేందుకు నిర్మించిన రిసార్ట్స్

ఎండ దెబ్బకు విద్యార్థులకు అస్వస్థత


చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: వడాలి జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఆటలాడుతూ ఎండ దెబ్బకు గురై ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. హైస్కూల్ ఆవరణలో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు బుధవారం సాయంత్రం విరామ సమయంలో ఆటలాడుతున్నారు. అదే సమయంలో ఎండ తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయారు. ఉపాధ్యాయులు వెంటనే స్పందించి వీరిని ముదినేపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ విద్యార్థులకు డాక్టర్ మనోజ్ చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎండ తీవ్రత కారణంగా కళ్లు తిరిగి పడిపోయినట్లు స్పష్టం చేశారు. అదే సమయంలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు ముదినేపల్లి వచ్చిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సమాచారం తెలుసుకుని హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్ మనోజ్‌కు సూచించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, బొర్రా శేషుబాబు, కోమటి విష్ణువర్ధన్, సాక్షి సాయిబాబు, బత్తిన కిషోర్, రాచూరి కుమార్, ఎంపీటీసీ సభ్యుడు జంపాన కోటయ్య, ఎస్సై వెంకటకుమార్ విద్యార్థులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆలయ చైర్‌పర్సన్ పదవికి విజయలక్ష్మి రాజీనామా


భీమవరం సోమేశ్వరస్వామి ఆలయంలో రాజీనామా లేఖపై సంతకం చేస్తున్న విజయలక్ష్మి

సాక్షి, భీమవరం: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీసోమేశ్వర జనార్దన స్వామివారి ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కోడే విజయలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం రాత్రి ఆలయంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి నైతిక బాధ్యత వహించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్న తరుణంలో తన భర్త యుగంధర్ పనులను పరిశీలిస్తుండగా పవన్ అనే యువకుడు దురుసుగా మాట్లాడడమేగాక తన భర్త మెడలోని రుద్రాక్షల దండను పట్టుకోవడంతో ఉద్రేకంతో పవన్‌ను నెట్టివేసినట్లు విజయలక్ష్మి చెప్పారు. అయితే దీనిని పెద్ద విషయంగా చిత్రీకరిస్తూ అల్లరి చేయడంతో నైతిక బాధ్యత వహించి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం.సురేష్‌బాబు సమక్షంలో రాజీనామా లేఖపై ఆమె సంతకం చేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ దేవాలయంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మావుళ్లమ్మ ఆలయ ఈఓ యర్రంశెట్టి భద్రాజీ, ఇన్‌స్పెక్టర్ వర్దినీడి వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన అర్చక సంఘం నాయకులు

సోమేశ్వరస్వామి ఆలయంలో చోటుచేసుకున్న ఘటనలో పురోహితుడు పవన్‌పై దాడి చేసిన కోడే యుగంధర్‌పై చర్యలు తీసుకోవాలని అర్చక సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి అర్చకులకు న్యాయం జరిగేలా, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామంటూ హామీ ఇచ్చారు.

వరిలో ఎండాకు తెగులును అరికట్టండి


వట్లూరులో వరి చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెదపాడు: రైతులు పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని విజయరాయి మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ ఎస్.చాముండేశ్వరి, మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టరు వి.భువనేశ్వరి అన్నారు. వట్లూరులో వరి పొలాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వి.భువనేశ్వరి మాట్లాడుతూ వరిలో ఎండు ఆకు తెగులు గుర్తించడం జరిగిందన్నారు. వరి నాటిన పొలంలో ఆకులు చివరలు ఎండిపోయి క్రమేపి దుబ్బు చనిపోవడం జరుగుతుందన్నారు. ఈ తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ మందును ఎకరాకు 200 గ్రాములు, కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రామలు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొలంలో నీటిని ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలన్నారు. ఎలుకల ఉధృతిని తగ్గించడానికి గట్లను శుభ్రం చేయాలన్నారు. ఏడీఏ సుబ్బారావు మాట్లాడుతూ వరి చేలకు నీటి ఎద్దడి సమస్యను నీటి పారుదల అధికారులు, జిల్లా కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వట్లూరు రైతులు త్సవలం శ్రీనివాసరావు, కొల్లిపర కొండలరావు, పర్వతనేని నాగభూషణం, పాతూరి శ్రీనివాసరావు, ముళ్లపూడి బాపినీడు చౌదరి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.





గడపగడపకు సంక్షేమం

తాడేపల్లిగూడెం రూరల్ : ఆరుళ్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

కాళ్ల : దొడ్డనపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

తీరంలో తీరనున్న విద్యుత్ కష్టాలు

- చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు
- రూ.4.76 కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం


విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలకు తగినట్లుగా కార్యాచరణ రూపొందించామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. బుధవారం నరసాపురంలోని సబ్‌స్టేషన్ వద్ద రూ.1.16 కోట్లతో నిర్మించిన కార్యాలయ భవనం, మంగళగుంటపాలెం అర్బన్ లేఅవుట్‌లో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రసాదరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గ పరిధిలో గడచిన నాలుగేళ్లలో విద్యుత్‌కు సంబంధించి రూ.227 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామన్నారు. తీర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. జగనన్న అర్బన్ కాలనీలో రూ.3.60 కోట్ల నిధులతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేసుకున్నామని, రూ.130 కోట్లతో చేపట్టనున్న 220/23 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించి టెండర్ల దశలో ఉందన్నారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, బర్రె శ్రీవెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, విద్యుత్‌శాఖ ఈఈ బళ్ల సురేష్‌కుమార్, డీఈ పి.ఓంకార్, ఈఈ కన్‌స్ట్రక్షన్ డీఈ టి వెంకటేశ్వరరావు, ఏఈలు సుధాకర్, ప్రభాకర్, శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటనర్సింహరావు, హౌసింగ్ డీఈ పి.వెంకటేశ్వరరావు, భూసారపు జయప్రకాష్, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సారా స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



చింతలపూడి: మండలంలోని దేశవరం గ్రామంలో ఎస్‌ఈబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారా, ఒక మోపెడ్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎస్‌ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మోనోజైట్ నిక్షేపాల కోసం అన్వేషణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాలోని కుమ్మరపురుగుపాలెం, శ్రీకాకుళం జిల్లాలోని కవిటిలో తీర ప్రాంతాల్లో మోనోజైట్ నిక్షేపాలు గుర్తించడానికి అన్వేషణ చేస్తున్నట్లు పీఎంవో సహాయ మంత్రి జితేంద్రసింగ్ చెప్పారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఇన్-సిటు మోనోజైట్ 13.07 మిలియన్ టన్నుల నిక్షేపాలున్నాయని చెప్పారు.

హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై పౌర సరఫరాల శాఖ దాడులు

నూజివీడు: గృహ సంబంధ రాయితీ గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు అక్రమంగా వాడుతున్న పట్టణంలోని పలు హోటళ్లు, వంటగ్యాస్ అక్రమ ఫిల్లింగ్ చేసే వ్యక్తులు, టిఫిన్ సెంటర్లపై ఏలూరు డీఎస్‌వో ఎస్.సత్యన్నారాయణరాజు మంగళ, బుధవారాల్లో దాడులు నిర్వహించి 15 వంట గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నారు. పట్టణంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్న కోసూరి వెంకట శ్రీనివాసరావు వద్ద ఐదు సిలిండర్లు, వంకాయల నాగరాజు వద్ద మూడు సిలిండర్లు, పెదవల్లి రమాదేవి, మరియప్ప అజిత్ వద్ద రెండేసి సిలిండర్లు, నక్కా మార్తమ్మ, పులపాక జగదీష్, అవినాష్‌ల వద్ద ఒక్కొక్క సిలిండర్ చొప్పున స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిపై 6ఏ కేసులను నమోదు చేశారు. డీఎస్‌వో వెంట నూజివీడు పీడీఎస్ డీటీ జీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

80 శాతం కాపులు వెనుకబడే ఉన్నారు

మాజీ ఎంపీ జోగయ్య

పాలకొల్లు సెంట్రల్: కాపుల్లో 80 శాతానికి పైగా జనాభా ఆర్థికంగా, సామాజికంగా, వైద్య, విద్య పరంగా వెనుకబడే ఉన్నారని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య అన్నారు. బుధవారం కాపు సంక్షేమ సేన మూడో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగయ్య మాట్లాడుతూ కాపులను బీసీల్లో చేర్చడం న్యాయమైన అంశమని అన్నారు. కాపు సంక్షేమ సేన రాబోయే రోజుల్లో పవన్ కల్యాణ్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ముందుగా స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ వద్ద శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాల వేసి కాపు సంక్షేమ సేన జెండాను ఆవిష్కరించారు. కాపుసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లినీడి బాబ్జి, చేగొండి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆకివీడు: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై కారు ఢీకొనడంతో ఓ చిరు వ్యాపారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఆకివీడుకు చెందిన శ్రీనివాస్ అయిభీమవరం బైపాస్ రోడ్డులో బజ్జీల బండిని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి శ్రీనివాస్ తన దుకాణాన్ని ముగించుకుని ఇంటికి తిరిగి స్కూటర్‌పై వెళుతుండగా కైకలూరు వైపు నుంచి వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొట్టి తిరగబడింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

క్లుప్తంగా

లయన్స్ సేవలు అభినందనీయం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. హంగర్ రిలీఫ్ సేవా కార్యక్రమంలో భాగంగా దాత దేవరబొట్ల సుశీలా ఫణి కుమార్ సౌజన్యంతో బుధవారం క్లబ్ సభ్యులు కావ్యా రెడ్డి, రేణుక ఆధ్వర్యంలో పడాల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కుందుం వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, కె.సాయి సత్యనారాయణ రాజు, పి.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి



తణుకులో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: ప్రజా సమస్యలను పాట రూపంలో సమాజానికి తెలిపిన మహోన్నత వ్యక్తి ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని లోటని వైఎస్సార్‌సీపీ యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. తణుకు 11వ వార్డులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సునీల్‌కుమార్ విప్లవవాది గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఎస్సీ జాకబ్‌బాబు, పుల్లెపు నూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తేతలి పంచాయతీ వార్డు పదవికి నామినేషన్ దాఖలు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ పంచాయతీ 8వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఈ వార్డు నుంచి గెలుపొందిన వార్డు సభ్యుడు కోట వెంకటేష్ (పప్పు) అకాల మరణంతో ఈ ఉప ఎన్నిక ఏర్పడింది. ఈనెల 19వ తేదీన జరిగే పంచాయతీ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కావడంతో వెంకటేష్ భార్య కోట విజయపార్వతి బుధవారం నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి వై యశ్వంత్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజారోగ్యం పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని బ్యాంక్ ఆఫ్ బరోడా తాడేపల్లిగూడెం శాఖ చీఫ్ మేనేజర్ బి.బంగారయ్య కొనియాడారు. బ్యాంక్ ఆఫ్ బరోడా నూట పదహారవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం మునిసిపల్ కార్యాలయం వద్ద 84 మంది మునిసిపల్ కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. పెదతాడేపల్లిశాఖ మేనేజర్ వై.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుల్లాయగూడెం, వెంకట్రావుపాలెంలో గడపగడపకు కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పుల్లాయగూడెం, వెంకట్రావుపాలెం గ్రామాల్లో గురువారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పచ్చదనంపై అవగాహన



సీఐ నాగరాజుకు మొక్కలు అందిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పచ్చదనం, పరిశుభ్రతలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని టౌన్ సీఐ నాగరాజు, ఎస్సైలు ప్రసాద్, రాజు అన్నారు. బుధవారం స్థానిక నారాయణ స్కూల్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి పలు ప్రాంతాల్లో మొక్కలు అందజేశారు. హెచ్‌ఎం. ఎ.యాన్సీ, ఏజీఎం రామిరెడ్డి, ఆర్ఐ బి.సురేష్, ఆర్.సురేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ఆరుళ్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం



ఆరుళ్ళ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, ఇదే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని ఉప ముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ తెలిపారు. బుధవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ళ, మారంపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదింట ఆడపిల్లల వివాహానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడతగా షాదీముబారక్, కల్యాణమస్తు పథకం కింద రూ.168కోట్లు విడుదల చేశారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో చంద్రబాబు 18,666మందికి రూ.118 కోట్లు షాదీ తోఫా ఎగ్గొట్టారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఏప్రియల్, మే, జూన్ నెలలకు సంబంధించి మూడో విడత నిధులు విడుదల చేశారన్నారు. ఇంత సమర్థవంతమైన పాలన అందిస్తున్నా చంద్రబాబు అండ్‌టీమ్ ఏదో విధంగా జగన్ ప్రభుత్వంపై బురదజల్లాలని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారన్నారు. చంద్రబాబు ప్రజలకు దుర్మార్గుడైతే కొంత మందికి మాత్రం డబ్బు వనరుగా మారారన్నారు. చంద్రబాబును సమర్థిస్తూ రాష్ట్ర ప్రజలకు పచ్చమీడియా ద్రోహం చేయడానికి వెనుకాడటం లేదన్నారు. మరో పక్క దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ సమయం సందర్భం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. ఎక్కడా ఏం జరిగినా దానికి ప్రభుత్వమే కారణమన్నట్టుగా మాట్లాడుతున్నాడన్నారు. ప్రతిపక్షాలు ఇలా ఉంటే ప్రజలు వారిని ఎలా గుర్తిస్తాయన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల రాక్షస పాలనను చూపించాడన్నారు. దీంతో విసుగు చెంది జగన్‌ను గెలిపించారన్నారు. నానాటికి జగన్‌పై పెరుగుతున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఇటీవల ఏలూరు, మన్యం, కోనసీమ జిల్లాల్లో సీఎం జగన్ పర్యటించిన సందర్భంగా వరద బాధితులు ఎంత బాధల్లో ఉన్నప్పటికీ ఎంతో ఆప్యాయంగా స్వాగతం పలికారన్నారు. అందరికీ సాయం అందిందా ? లేదా ? అంటూ వరద బాధితులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తున్నా ప్రజలు నష్టపోవాలని కోరుకునే దుర్మార్గులు రాష్ట్రంలో ఉన్నారన్నారు. రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, సర్పంచ్‌లు మాకరాజు వరలక్ష్మి, సరిపల్లి పద్మ, ఎమ్పీటీసీలు వీర్లపాటి జ్యోతి, మార్లపూడి సుబ్బారావు, నార్ని నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జద్దు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, సంపతరావు కృష్ణారావు, మాకరాజు సతీష్, బొద్దాని శ్రీనివాస్, మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, చిట్టూరి బాపన్న, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ, ఏపీఎం జీవీ కేడీఎం.లక్ష్మి, ఏవో ఆర్‌ప్రసాద్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, సచివాలయ కార్యదర్శి శేఖర్‌బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులు చీడపీడలను నివారించుకోవాలి



జీవామృతం కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

పెంటపాడు: ప్రకృతి వ్యవసాయ రైతులు చీడపీడలను నివారించుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా పీడీ వై. నూకరాజు పేర్కొన్నారు. పెంటపాడు యూనిట్ పరిధిలో మీనవిల్లూరు గ్రామంలో రైతులకు సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భీజామృతం, జీవామృతం తదితర ద్రావణాలు వల్ల చీడపీడలను నివారించుకొనే విధానం రైతులకు తెలిపారు. జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు తెలిపారు. సార్వా పంటకు ప్రధానంగా చీడపీడలు నివారించే శక్తి కేవలం భీజామృతానికే ఉందన్నారు. ప్రధానంగా విత్తనశుద్ధి చేసుకొంటే పంటను అధిక శాతం చీడపీడల నుంచి రక్షించుకోవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, మండల ఇన్‌చార్జి గుమ్మళ్ల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పొందాలి

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



వేల్పూరులో జరిగిన నాభూమి-నాదేశం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: విద్యార్థులు భారత స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల నుంచి విద్యార్థులు స్ఫూర్తిని పొందాలని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం ఆజాది కా అమృత్ మహోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన నాభూమి-నాదేశం కార్యక్రమాల్లో తణుకు రూరల్ మండలం వేల్పూరు, దువ్వ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను ప్రతీ ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులు దేశ స్వాతంత్ర్య సమర యోధుల గురించి తెలుసుకోవాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం తణుకు ప్రాంతం నుంచి మొత్తం 17 మంది పాల్గొన్నారని, కొందరు జైలు జీవితం కూడా గడిపారని చెప్పారు. వారందరినీ గుర్తించి వారి స్మారక విగ్రహాలను తణుకులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నాదేశం- నాభూమి మట్టి నమూనాలను సేకరించారు. గ్రామాల్లో స్మారక స్థూపాలను ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. దువ్వ గ్రామంలో మంత్రి కారుమూరి జాతీయ జెండా చేతబట్టి పాఠశాల విద్యార్థులతో స్థానిక గీతా మందిరం నుంచి కొత్త చెరువు వరకూ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజు, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, వేల్పూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తివ వెంకట్రామన్న, దువ్వ సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, ఎంపీటీసీ సభ్యులు చుంద్రు శ్యామల, రెడ్డి హైమా, పాలా వెంటక దుర్గ, జస్పాల్, ఏఎంసీ డైరెక్టర్లు బండి పార్వతి, లక్ష్మీ, ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ రామ్‌ప్రసాద్, గ్రామ కార్యదర్శులు గంగాధరరావు, నరశింహమూర్తి, వివిధ సచివాలయాల సిబ్బంది, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భాజపా పాలనపై నిరసన



పట్టణంలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కార్మికవర్గం, రైతాంగం, ప్రజలు సంసిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న మహా ధర్నాకు మద్ధతుగా పట్టణంలో బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన, ఆర్టీసీ డిపో వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం భారీ ధర్నా జరిగింది. డి.సోమసుందర్ మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోదీని గద్దె దించండి, దేశాన్ని రక్షించండి నినాదంతో కేంద్ర కార్మిక సంఘాలు దేశ వ్యాప్త ఉద్యమం ప్రారంభించినట్లు తెలిపారు. కార్మిక హక్కులను, చట్టాలను మోదీ ప్రభుత్వం కాలరాసిందని విమర్శించారు. దేశంలో కుల మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య విభజన తెస్తున్నారని, ప్రజలు గమనించి, మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు, సీడబ్ల్యూసీ, మునిసిపల్, కాంట్రాక్ట్ కార్మికులు, ఎస్‌డబ్ల్యూసీ, భవన నిర్మాణ కార్మికులు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం కోర్టు సముదాయం ఆవరణలో వచ్చే నెల సెప్టెంబర్ 9వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్‌శ్రీలు వెల్లడించారు. సీనియర్ సివిల్ జడ్జి కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కోర్టు పరిధిలో తాడేపల్లిగూడెం టౌన్, రూరల్, పెంటపాడు, చేబ్రోలు, నిడమర్రు, గణపవరం, అనంతపల్లి, ఎక్సైజ్ సంబంధించిన కేసులు పరిష్కారం నిమిత్తం లోక్ అదాలత్ జరుగుతుందని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగిన అన్ని కేసుల్లో కక్షిదారులు నేరుగా గాని, న్యాయవాదితో గాని వచ్చి పరిష్కరించకోవచ్చునని వెల్లడించారు. చెక్ బౌన్స్ కేసులు, మోటార్ వాహనాలు కేసులు, చిట్‌ఫండ్స్‌కేసులు, సివిల్, తదితర ప్రీలిటిగేషన్ కేసులలో పరిష్కారం నిమిత్తం లోక్ అదాలత్‌లో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

గురుభక్తిని చాటిన ఏకలవ్యుడు



మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గురు దక్షిణగా తన బొటన వేలిని సమర్పించి గురుభక్తిని చాటిన మహనీయుడు ఏకలవ్యుడని మున్సిపల్‌మాజీ వైస్‌చైర్మన్ కర్రి భాస్కరరావు అన్నారు. బుధవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ఆదివాసీలు గిరిజనులు ప్రకృతి ప్రసాదించిన బిడ్డలని, విశ్వాసానికి ప్రతీక పేర్కొన్నారు. గిరిజనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, వారి అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనుల కోరిక మేరకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అల్లూరి మన్యం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావు, దృశ్య కళల అభివృద్ధి సంస్థ స్టేట్ డైరెక్టర్ మానికొండ వెంకటేశ్వరరావు, గిరిజన రత్న సింగం పట్టాభి, జానకమ్మట్రస్ట్ చైర్మన్ సింగం కృష్ణ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, మోదుగ గుంట వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా జానకీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 32వ వార్డు కడకట్లలో బుధవారం యానాది కాలనీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఏపీ యానాది సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడుకొండలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దయతో రాష్ట్రంలో అనేక సంక్షేమాలు అమలు అవుతున్నాయని, గిరిజన పిల్లలు నేడు చక్కని చదువులు చదువుతున్నారని వెల్లడించారు. యానాది గిరిజనులు ప్రభుత్వ సంక్షేమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సహకారంతో యానాది కాలనీలో నూతన గృహాలను నిర్మించడం వల్ల యానాది గిరిజనుల చిరకాల కల నెరవేరిందన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో కాటంరాజు, రాంబాబు, శ్రీను, మంగ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారం పంపిణీ



తణుకులో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులైన పిల్లలకు పోషకాహారం అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారం అందచేయడం అభినందనీయమని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ అన్నారు. గౌతమి సాల్వెంట్స్ అధినేత మల్లిన రామచంద్ర రావు దాతృత్వంతో తణుకు సేఫ్ కేర్ సెంటర్‌కు వచ్చే హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు నెలకు సరిపడా నిత్యావసరాలు, పోషకాహారాన్ని బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఒక ఏడాది పాటు ప్రతి నెలా పోషకాహారం అందిస్తున్న రామచంద్రరావు సేవలను కొనియాడారు. రామచంద్రరావు మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులంతా క్రమం తప్పకుండా మందులు వాడుతూ మంచి పోషకాహారం తీసుకోవడం వలన వారి జీవితకాలం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేఫ్ కేర్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పుప్పాల రాజరాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

పుడమి తల్లిని కాపాడుకుందాం



తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: మట్టి కాలుష్యం కాకుండా ప్రతీ ఒక్కరూ కాపాడుకోవాలని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని నీలాద్రిపురం, పుల్లాయగూడెం, పెదతాడేపల్లి గ్రామాల్లో నా భూమి - నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలాద్రిపురంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేది వరకు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించనుందన్నారు. దీనిలో భాగంగా నేడు శిలాఫలకాన్ని దేశానికి అంకితమివ్వడం, సెల్ఫీలు అప్‌లోడ్ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాలను సమన్వయంతో జయప్రదం చేయాలన్నారు. గ్రామసర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతీ అణువు జన్మభూమి కోసం జీవించడమే స్వాతంత్ర్య సమరయోధులకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. పెదతాడేపల్లిలో సర్పంచ్‌పోతుల అన్నవరం, పుల్లాయగూడెంలో సర్పంచ్ చీకట్ల పుష్పలక్ష్మీకుమారి, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, డీడీవో టి.రవిచంద్ర, నీలాద్రిపురం కార్యదర్శి టి.పవన్‌కుమార్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ మహాసభలకు తరలిరండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులతో విజయవాడలో ఆగస్టు 21, 22 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.బాలకృష్ణ తెలిపారు. పట్టణంలో పెన్షనర్స్ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కె.బాలకృష్ణ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఒక డీఆర్ బకాయిలు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వైవీ సత్యనారాయణ మూర్తి, వీకే వీరారావు, అర్జునరావు, గరికపాటి సుబ్రహ్మణ్యశర్మ, ఎండీ భాష, ప్రభావతి, పార్వతి, జయరాజు, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య యోధుల త్యాగాలు చిరస్మరణీయం

ఇరగవరం: స్వాతంత్ర్య యోధుల త్యాగాలు చిరస్మరణీయమని ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు అన్నారు. బుధవారం ఇరగవరం మండలంలో అన్ని గ్రామ పంచాయతీల వద్ద నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఇరగవరం గ్రామం నుంచి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వారి వారసులను పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ పాలా పాలేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరవల్లి యుగంధర్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



తణుకులో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజరు రాజశేఖర్, తదితరులు

తణుకు అర్బన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని తణుకు ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజరు ఎస్.రాజశేఖర్ అన్నారు. కేంద్రప్రభుత్వ ఆదేశానుసారం ప్లాంట్ ఎ లైఫ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తణుకు ఎల్ఐసీ కార్యాలయంలో మొక్కలు నాటి కార్యాలయానికి వచ్చిన వారికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం మనందరి లక్ష్యంగా మలచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఏబీఎం సుదీప్ఞ, ఉద్యోగులు పి.రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, పీఆర్‌కే, శ్యామ్, విజయలక్ష్మి, ఎల్ఐసీ ఏవోఐ అధ్యక్షుడు సలాది ఉదయ భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు సత్తి పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సంతాపం



టీ వేమవరంలో గుబ్బల నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు టౌన్: ఇటీవల మృతి చెందిన బీసీ నాయకుడు గుబ్బల నరసింహారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పరామర్శించారు. గురువారం టీ వేమవరంలోని నరశింహారావు నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరశింహారావు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాడ సానుభూతిని తెలిపారు. తణుకు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పీతల కృష్ణ మృతికి ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సంతాపం తెలిపారు. బుధవారం తణుకు పాతూరులోని కృష్ణ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డీఆర్‌జీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వెంకటేశ్వరరావు

పెంటపాడు: మండలంలోని డీఆర్‌గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన డాక్టర్ ఎం. శ్యాంబాబు శ్రీకాకుళం జిల్లా పాలకొండకు బదిలీపై వెళ్లారు. తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బదిలీపై వచ్చిన ఈయనకు పలువురు అధ్యాపకులు పుష్పగుచ్చాలతో ప్రత్యేకంగా అభినందించారు.